గణేషుడికి బెల్లంతో అలంకారం



రాయదుర్గం: సంకష్టహర చవితిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో మంగళవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలోని గణపతికి పూలు, అత్యంత ఇష్టమైన బెల్లం ముద్దలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. అనంతరం గణపతికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అంతేకాకుండా ఆలయంలో షిర్డీసాయిబాబా, కాశీవిశ్వేశ్వరస్వామి, ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలను కూడా నిర్వహించారు.

ఫుడ్‌స్టాల్స్‌, పీజీ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీ



తనిఖీలు చేస్తున్న కార్పొరేటర్‌ నాగేందర్‌ యాదవ్‌, ఏఎంఓహెచ్‌ డాక్టర్‌ శ్రీకాంత్‌రెడ్డి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో ఫుడ్‌స్టాల్స్‌, పీజీ హాస్టళ్లలో కార్పొరేటర్‌ రాగంనాగేందర్‌యాదవ్‌, ఏఎంహెచ్‌ఓ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి తనిఖీలు చేశారు. తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదు రాకుండా పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు వండేలా వాటిని వినియోగదారులకు అందించేలా చూడాలని ఆదేశించారు.

లింగంపల్లి నుండి ఉప్పల్‌కు ఏసీ ఎలక్ట్రికల్‌ బస్సులు

మియపూర్‌: మియాపూర్‌ –2 డిపో పరిధిలో లింగంపల్లి నుండి ఉప్పల్‌కు మూడు ఏసీ ఎలక్ట్రికల్‌ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్‌ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుండి సర్వీస్‌ నంబర్‌ 113కే ఎల్‌ బస్సులు లింగంపల్లి నుండి ఉప్పల్‌కు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బ్యాక్‌లాగ్‌ సీట్ల ప్రవేశాలకు దరఖాస్తులు

పటాన్‌చెరు టౌన్‌: మండలంలోని ఐనోల్‌ పరిధిలో ఉన్న మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల బాలుర/బాలికల పాఠశాలల్లో 6, 7, 8 ,9 తరగతుల్లో బ్యాక్‌లాగ్‌ సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల ప్రిన్సిపాల్‌ స్రవంతి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఏప్రిల్‌ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. హాల్‌ టికెట్లను ఏప్రిల్‌ 15న డౌన్‌లోడ్‌ చేసుకోవాలని, పరీక్ష ఏప్రిల్‌ 20న నిర్వహిస్తారని చెప్పారు. మెరిట్‌ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగించుకోవాలని కోరారు.

జేఏసీకి విరాళాలు అందజేత

జిన్నారం (పటాన్‌చెరు): ప్యారానగర్‌ డంపింగ్‌ యార్డ్‌ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన దీక్షలు 42వ రోజుకు చేరాయి. మంగళవారం గ్రామంలోని శివాజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. స్థానిక రజక సంఘం తరఫున రూ.5 వేలు, నగరానికి చెందిన ప్రసాద్‌, రామరాజు లు రూ.10 వేలు జేఏసీ నాయకులకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. నిరసన కార్యక్రమాలకు అన్ని వర్గాల నుంచి ఆర్థికంగా, ప్రత్యక్షంగా మద్దతును తెలుపుతున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ కథనం ప్రకారం .. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా 9 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు, ఒకరికి రూ .1500, మరో వ్యక్తికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌పోలీసులు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్‌: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. నల్లపోచమ్మ దేవస్థానం సమీపంలో వేపచెట్టు కింద చిత్తు కాగితాలు ఏరుకునే గుర్తుతెలియని వ్యక్తి పడుకున్న చోటే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుడి చేతికి శివుడి డమరుకం స్టీల్‌ కడియంఉండటాన్ని గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

‘పది’ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

21వ తేదీ నుంచి పరీక్షలు



శేరిలింగంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ భవనం (పరీక్షా కేంద్రం)

- 28 పరీక్షా కేంద్రాలు.. 6,090 మంది విద్యార్థులు
- పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

శేరిలింగంపల్లి: పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు మండల విద్యాధికారి ఎస్‌ వెంకటయ్య పర్యవేక్షణలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థులను పరీక్షలకు ఇప్పటికే టీచర్లు సిద్ధం చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వారిని ప్రత్యేక తరగతులను నిర్వహించారు.

- శేరిలింగంపల్లి మండలంలో 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 6,090 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాలను మండల విద్యాధికారి వెంకటయ్య పరిశీలించి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్షించారు.
- ప్రతి క్లాస్‌ రూమ్‌లో 24 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ ఉంటారు.
- పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల ముందు సీల్డ్‌ కవర్‌లో ఉన్న పేపర్‌ను తీసేలా ఏర్పాట్లు
- ప్రైవేట్‌ స్కూల్స్‌లో సీసీ కెమెరాలు ఇప్పటికే ఉండగా, జిల్లా పరిషత్‌ హైస్కూల్స్‌లో సీసీ కెమెరాలు లేని చోట వాటిని ఏర్పాటు చేశారు
- ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు ఎలా రాయాలో కూడా మానసికంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఇప్పటికే సిద్ధం చేశారు.

విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేశాం



శేరిలింగంపల్లి మండల పరిధిలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. పూర్తి స్థాయిలో వసతులు ఉన్న స్కూళ్లలోనే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. తాగునీరు, ఫ్యాన్స్‌, లైట్స్‌ ఉండేలా కూడా చర్యలు తీసుకున్నాం.

– ఎస్‌ .వెంకటయ్య, ఎంఈఓ, శేరిలింగంపల్లి మండలం

చెరువు రూపురేఖలు మారుస్తాం



కాయిదమ్మకుంట చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు పునరుద్ధరణ పనులతో దశ దిశ మారుస్తామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం డివిజన్‌ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు సుందరీకరణలో భాగంగా నెక్సస్‌ సెలెక్ట్‌ మాల్స్‌ సంస్థ సీఎస్‌ఆర్‌ ఫండ్స్‌ ద్వారా మల్లిగవాడ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువు పునర్జీవనంలో భాగంగా సుందరీకరణ, పునరుద్ధరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురికి కుంపటిగా ఉన్న చెరువు స్వచ్ఛమైన మంచి నీరు లాంటి చెరువుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు.

బస్తీ దవాఖానాల తనిఖీ



ప్రేమ్‌నగర్‌ బస్తీ దవాఖానాలో తనిఖీలు చేస్తున్న శేరిలింగంపల్లి జోన్‌ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ కె.సుధాకర్‌ లాల్‌

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ పరిధిలోని బస్తీ దవాఖానాలను మంగళవారం శేరిలింగంపల్లి జోన్‌ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ కె.సుధాకర్‌ లాల్‌ ఆకస్మిక తనిఖీలు చేసి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌ పరిధిలోని 272 బస్తీ దవాఖాలలో అందుతున్న వైద్య సేవలపై వైద్య ఆరోగ్య కమిషనర్‌, డైరెక్టర్‌ ఆఫ్‌ హెల్త్‌ ఆదేశాల మేరకు గ్రేటర్‌ హైదరాబాద్‌లోని అర్బన్‌ పీహెచ్‌సీ హఫీజ్‌పేట్‌ పరిధిలోని ప్రేమ్‌నగర్‌, హెచ్‌ఎంటీ కాలనీలోని బస్తీ దవాఖానాలను, శేరిలింగంపల్లి పీహెచ్‌సీ పరిధిలోని గంగారం బస్తీ దవాఖానాలను విస్తృత తనిఖీలు చేశామన్నారు. బస్తీ దవాఖానాలలో అందుతున్న సేవలను పరిశీలించామని, మరింత నాణ్యమైన వైద్య సేవలందించేందుకు కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు.

భవానీ కాలనీలో హైడ్రా అధికారుల పర్యటన



భవానీకాలనీ పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

బండ్లగూడ: పార్కు, ఆలయ, వాటర్‌ ట్యాంకర్‌ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని పరిరక్షించాలని కోరుతూ భవానీకాలనీ వాసులు సోమవారం ప్రజావాణిలో హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా అధికారులు మంగళవారం భవానీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా స్థలాలను పరిశీలించారు. స్థల పరిమితులు, భూస్వామ్య వివరాలు, భవిష్యత్‌లో ఈ స్థలాలను అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రాథమిక అధ్యాయనం ప్రారంభించారు. స్థలాల పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు తెలిపారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హైడ్రా టీం సీఐ తిరుమల్లేశ్‌, కాలనీ వాసులు అశోక్‌, శ్రీనివాస్‌, మల్లేశ్‌, మరిమల్‌రాజ్‌, రవిబొల్ల, నాగేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మనోజ్‌, వినోద్‌, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి వరకు మెట్రోను పొడిగించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జయరాజు

పటాన్‌చెరు టౌన్‌: మియాపూర్‌ నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైలును పొడిగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. పటాన్‌చెరు పట్టణంలోని శ్రామికభవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో మెట్రో రైలుకు నిధులు కేటాయించాలని డిమాండ్‌ చేశారు. సంగారెడ్డినుంచి హైదరాబాద్‌కు నిత్యం వేలాదిమంది ప్రయాణం చేస్తున్నారని ఈ ప్రాంతానికి మెట్రో తప్పనిసరిగా కేటాయించాలని కోరారు. ప్రభుత్వ హామీలు అమలుకు నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య, ఏరియా కార్యదర్శి నాగేశ్వరావు, పాండు రంగారెడ్డి, శాంత కుమార్‌ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో మంగళవారం డిపో ఉద్యోగులకు మజ్జిగ పంపిణీని డిపో మేనేజర్‌ హరి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు వేసవి కాలంలో మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వేసవి కాలం అంతటా మజ్జిగను అందిస్తామని తెలిపారు. డ్యూటీపై ఎండలో వెళ్లి వచ్చిన కండక్టర్‌, డ్రైవర్స్‌కు మజ్జిగ ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ అసిస్టెంట్‌ మేనేజర్‌ శ్రీలత, మెకానికల్‌ ఇంజినీరింగ్‌ రాజేశ్వరి పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్‌ సభ్యుడికి డైరీ అందజేత

సాక్షి,సిటీబ్యూరో: భారత ప్రభుత్వ షెడ్యూల్డ్‌ కులాల జాతీయ కమిషన్‌ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌కు మంగళవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌లో టీజీవోస్‌ జిల్లా కమిటీ అసోసియేషన్‌ సభ్యులు నూతన డైరీని అందజేశారు. అనంతరం జిల్లా ప్రతినిధులు మెమోంటోలను అందజేసి ఘనంగా సత్కరించారు. తెలంగాణ గెజిటెడ్‌ అధికారుల సంఘం మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు వినోద్‌ కుమార్‌ పాల్గొన్నారు.

‘గీతం’కు నేషనల్‌ రీసెర్చ్‌ ఫౌండేషన్‌ గ్రాంట్‌

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం డీమ్డ్‌ విశ్వవిద్యాలయంకు మరో ప్రతిష్ఠాత్మక పరిశోధనా ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం (డీఎస్టీ)లోని అనుసంధాన్‌ నేషనల్‌ రీసెర్చ్‌ ఫౌండేషన్‌ (ఏఎన్‌ఆర్‌ఎఫ్‌) గీతం స్కూల్‌ ఆఫ్‌ సైన్స్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ మోతాహర్‌ రెజాకు పరిశోధనా ప్రాజెక్టును మంజూరు చేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. డాక్టర్‌ రెజాకు సహాయకారిగా జూనియర్‌ రీసెర్చ్‌ ఫెలో (జేఆర్‌ఎఫ్‌) అవసరమని తెలిపారు. ఎంటెక్‌ లేదా ఎమ్మెస్సీ (గణితం) ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై, గేట్‌ లేదా నెట్‌ అర్హతతోపాటు మ్యాట్‌ ల్యాబ్‌ ప్రోగ్రామింగ్‌లో ప్రావీణ్యం ఉన్న 32 ఏళ్ల వయస్సు లోపు వారు (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు, మహిళ లకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది) దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జేఆర్‌ఎఫ్‌గా ఎన్నికైన వారికి నెలకు రూ.37 వేల భత్యంతోపాటు ఇంటి అద్దె అలవెన్సు కూడా ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డాక్టర్‌ రెజా 78730 49059ను సంప్రదించాలని సూచించారు.

అన్ని పార్టీల నాయకుల సమావేశం



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ ముకుందరెడ్డి

చందానగర్‌: శేరిలింగంపల్లి సర్కిల్‌ 20లో మంగళవారం చీఫ్‌ ఎలక్షన్‌ కమిషన్‌ ఆదేశాల మేరకు ఆల్‌ పొలిటికల్‌ పార్టీ మీటింగ్‌ ఈఆర్‌ఓ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్‌ఓ ముకుంద్‌ రెడ్డి .. ఓటర్‌ నమోదు, గత ఎన్నికల్లో కంటెస్‌ చేసిన అభ్యర్థుల పెండింగ్‌ బిల్లులు, బీఎల్‌ఓల విధులలోకి తీసుకోవడంపై పలు అంశాలను వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్‌ కాలనీ బీ, సీ బ్లాక్‌లలో సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్‌ రాగంనాగేందర్‌యాదవ్‌ తెలిపారు. కాలనీలో కార్పొరేటర్‌ పాదయాత్ర నిర్వహించారు. రహదారులపై నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలని, సరైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని, ఎత్తైన ప్రాంతాలలో మంచినీరు లో ప్రెషర్‌తో వస్తోందని, వంగిపోయిన విద్యుత్‌ స్తంభాలను ఆధునీకరించాలని, వీధిదీపాలను ఏర్పాటు చేయాలని, రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. ఇందుకు కార్పొరేటర్‌ స్పందిస్తూ సమస్యలన్నింటిని దశలవారిగా పరిష్కరించేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు జలమండలి మేనేజర్‌ సందీప్‌రెడ్డి, ఏఈ భాస్కర్‌, కాలనీవాసులు పాల్గొన్నారు.


చందానగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత



చందానగర్‌: చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని శ్రీదేవి థియేటర్‌ రోడ్డులో ఇరువైపులా అక్రమాల నిర్మాణాలు మంగళవారం జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్‌ అధికారులు, సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా డీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. చందానగర్‌లోని శ్రీదేవి థియేటర్‌ నుంచి అమీన్‌పూర్‌ కమాన్‌ వరకు రోడ్డు 150 అడుగుల విస్తరణలో భాగంగా కూల్చివేశామన్నారు. బీహెచ్‌ఈఎల్‌ ఫ్లైఓవర్‌ త్వరలోనే ప్రారంభం కానుందన్నారు.

స్పీడ్‌ బ్రేకర్లతోనే వేగ నియంత్రణ

మణికొండ: స్పీడ్‌ బ్రేకర్ల ఏర్పాటుతోనే వేగ నియంత్రణ సాధ్యమని నార్సింగి ట్రాఫిక్‌ సీఐ ఎం. నిరంజన్‌రెడ్డి అన్నారు. ఎస్సై రాజేశ్‌గౌడ్‌, మణికొండ మున్సిపాలిటీ ఆల్‌ కాలనీస్‌ ఫెడరేషన్‌ అధ్యక్షుడు వంశీతో కలిసి అలకాపూర్‌ టౌన్‌షిప్‌, ఈవీవీ కాలనీ, పయనీర్‌ కాలనీ, గోల్డన్‌ టెంపుల్‌ రోడ్డు, తిరుమలహిల్స్‌,ఎస్సార్‌ కాలనీల్లో మంగళవారం పర్యటించారు. స్పీడ్‌ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను గుర్తించారు. అలాగే రోడ్లపై గుంతలను పూడ్చివేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ డీఈ శివసాయి, ఏఈ సంజయ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



వెస్ట్‌జోన్‌ జోనల్‌ కమిషనర్‌ కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్‌ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు కాలనీలలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ వెస్ట్‌జోన్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డిని కాంగ్రెస్‌ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి, జీహెచ్‌ఎంసీ స్టాండిగ్‌ కమిటీ సభ్యులు జగదీశ్వర్‌గౌడ్‌ కోరారు. జోనల్‌ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రాన్ని మంగళవారం అందించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్‌ మాట్లాడుతూ.. హఫీజ్‌పేట్‌, మాదాపూర్‌ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో సరైన విధంగా లైట్లు వెలగడం లేదని, కొన్ని అసలే లేవని, పాదచారులు, వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారని జెడ్సీ దృష్టికి తీసుకొచ్చారు. పెండింగ్‌ పనులు, కొత్తగా ప్రతిపాదించిన వాటికి అవసరమైన నిధులు మంజూరు చేసి అవి పూర్తయ్యేలా చూడాలని కోరారు.

కాలనీలు,బస్తీలలో సౌకర్యాలు కల్పిస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: అన్ని కాలనీలు, బస్తీలలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హామీ ఇచ్చారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని మసీదుబండ సీఎంసీ ఎన్‌క్లేవ్‌ రెసిడెంట్స్‌వెల్ఫేర్‌ అసోసియేషన్‌ వినతిపై ఆయన మంగళవారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అసంపూర్తిగా మిగిలిన సీసీరోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, యూజీడీ పనులను కూడా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, మంచినీటి వ్యవస్థను మెరుగుపర్చాలని, వీధిదీపాలను వెలిగేలా చూడాలని కోరారు. వాటర్‌ ట్యాంకర్లతో కాలనీలో ఏర్పడిన ట్రాఫిక్‌ సమస్యను వెంటనే పరిష్కరించాలని వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందించారు. కాలనీలో అన్ని సమస్యలకు త్వరలో మోక్షం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాజుయాదవ్‌, మల్లేష్‌యాదవ్‌, మహేష్‌, సాంబశివరావు, రామ్మోహన్‌, మురళీకృష్ణ,మూర్తి, శ్రీనివాస్‌, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఉన్నత పాఠశాల వార్షికోత్సవం



వేడుకల్లో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌ యాదవ్‌

చందానగర్‌: శేరిలింగంపల్లి డివిజన్‌ పరిధిలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా కార్పొరేటర్లు రాగం నాగేందర్‌ యాదవ్‌, జగదీశ్వర్‌ గౌడ్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల నుంచే మెరుగైన విద్యను అందించి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేరేలా కృషి చేయాలన్నారు. క్రమశిక్షణ నాణ్యమైన విద్యను అందించడమే శేరిలింగంపల్లి జిలాల పరిషత్‌ ఉన్నత పాఠశాల ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో డివిజన్‌ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్‌, పాఠశాల హెచ్‌ఎం రత్నప్రభ, ఇంచార్జి హెచ్‌ఎం బల్వంత్‌రెడ్డి, జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

డ్రైవర్లు ట్రాఫిక్‌ నిబంధనలు తప్పక పాటించాలి



డ్రైవర్లకు ఖాకీ దుస్తులు అందజేస్తున్న ట్రాఫిక్‌ ఏసీపీ నాగభూషణం

శంషాబాద్‌: డ్రైవర్లు తప్పకుండా ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని శంషాబాద్‌ ట్రాఫిక్‌ ఏసీపీ నాగభూషణం సూచించారు. బీఎంఎస్‌ ఆటో, ట్యాక్సీ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్‌ గుప్తా ఆధ్వర్యంలో వైఎన్నార్‌ గార్డెన్‌లో మంగళవారం ట్రాఫిక్‌ అవగాహన సదస్సు ఏర్పాటు చేయగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రైవర్లు విధిగా ఖాకీ దుస్తులు మాత్రమే ధరించాలన్నారు. అలాగే రాంగ్‌ సైడ్‌ డ్రైవింగ్‌ కారణంగా జరుగుతున్న ప్రమాదాలను వివరించారు. అనంతరం నందకిశోర్‌ అందజేసిన 50 ఖాకీ దుస్తులను డ్రైవర్లకు అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ సీఐ రాజు, శంషాబాద్‌ బీఎంఎస్‌ అధ్యక్షుడు జగదీశ్‌, రాష్ట్ర నాయకుడు సయ్యద్‌, రవి, శీను, నరేందర్‌, చారి, శివ, మల్లేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

వినాయక్‌నగర్‌లో ‘గుడ్‌ మార్నింగ్‌ మణికొండ’



ప్రజలతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు డి.సీతారాం నాయకులతో కలిసి వినాయక్‌నగర్‌లో ‘గుడ్‌ మార్నింగ్‌ మణికొండ’ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో తమ కాలనీ ద్వారా పెద్ద సంఖ్యలో వాహనాలు వెళ్తుండడంతో ఇబ్బందిగా మారిందన్నారు. అలాగే వర్షాకాలంలో వరద నీరంతా తమ కాలనీలోకి వస్తున్నదని డ్రైనేజీని ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి తనవంతూ కృషి చేస్తామని ఆయ హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె. ధన్‌రాజ్‌, జి.నరేందర్‌, ఉపేంద్రనాథ్‌రెడ్డి, జి. విఠల్‌ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం ఏర్పాటు



పరీక్షల నిర్వహిస్తున్న వైద్యులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం అనంతారం గ్రామపంచాయతీలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షేయ వ్యాధి శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 21 మందికి వైద్య బృందం క్షయ పరీక్షలు నిర్వహించి వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి తెమడ పరీక్షలు నిర్వహించి.. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాధికారి మధుకర్‌, టీవీ ఫీల్డ్‌ అధికారి కృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాస్‌ పంచాయతీ కార్యదర్శి సురేష్‌యాదవ్‌, సిబ్బంది శివా నర్సిరెడ్డి, ఏఎన్‌ఎం వసుంధర, సునీత సువాసిని, ఆశాలు గిరిజ, అంగన్‌వాడీ టీచర్లు ఆరోగ్య కేంద్ర సిబ్బంది రోగులు పాల్గొన్నారు.

జాతరలు సంప్రదాయానికి ప్రతీక

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి



జాతరలో బీజేపీ నాయకురాలు గోదావరి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం వావిలాలలో మంగళవారం మల్లికార్జునస్వామి జాతర భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలకు ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. మల్లన్న స్వామి దయతో జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, నాయకులు అశోక్‌, లక్ష్మణ్‌, రమణసింగ్‌, వెంకటేష్‌, సత్యనారాయణ, రాజు, నంద పాల్గొన్నారు.